కథా నిలయం
6077
శ్రీకాకుళం

ముల్లంగి వెంకట రమణారెడ్డి
39-18-1, మాధవధార
విశాఖపట్నం-530 007
ఫోన్: 0891-2722189

# ఉఫ్...వెంట్రుక

రాత్రి రెండున్నర సమయం...

శ్రీవారి గర్భగుడి తలుపులు మూతపడ్డాయి. భక్త జన సందోహం తాకిడితో అలసిపోయిన వేంకటేశ్వరుడు కాసేపు కునుకు తీద్దామనుకున్నాడు.

ఇంతలో సన్నటి ఏడ్పు విన్పించింది. స్వామికి ఆశ్చర్యం కలిగింది. గర్భగుడిలో ఎవరైన చిక్కుబడిపోయారా అని నలుదిక్కులా చూసాడు.

ఎవరూ కన్పించలేదు. అయినా చిన్నగా ఏడ్పు విన్పించింది. తన భక్తుల్లో ఎవరికి ఏ ఆపద కలిగిందోనని స్వామి కంగారుపడ్డాడు. ఎవరూ కన్పించట్లేదు.

"ఎవరూ...?" అన్నాడు స్వామి.

ఉలుకూ లేదు పలుకూ లేదు. ఏడ్పు తప్ప.

"ఎవరూ లేరే...కానీ ఆ ఏడ్పు ఎక్కడిదబ్బా..." అని ఆశ్చర్యపోయి గర్భగుడి అంతా మరోసారి చూశాడు. ఏ ప్రాణీ కన్పించలేదు...ఏడ్పు మాత్రం విన్పిస్తూనే ఉంది.

స్వామి కంగారుగా...కొంచెం కోపంగా...'ఎవరదీ?' అన్నాడు గట్టిగా.

ఏడ్పు ఆగిపోయింది.

"హు...మీ కంటికి నేనెక్కడ కన్పిస్తాను స్వామీ...ఏటా నా వల్ల వచ్చే నలభై కోట్ల రూపాయల ఆదాయం మాత్రం కన్పిస్తుంది..." ఒక నిష్ఠూరమైన మాటతో పాటు మళ్లీ ఏడ్పు విన్పించింది.

శ్రీవారు కొంచెం ఉలిక్కిపడ్డారు. ఇదేదో తనని ఇరకాటంలో పడేసే మాటలా అన్పించి...కొంచెం జాగ్రత్తగా చూశారు. ఏమీ కన్పించలేదు.

కె.వి.నరేందర్

"ఇటు చూడండి స్వామీ ఈ మూలకు.." అని విన్పించడంతో అటువైపు చూశాడు. ఒక వెంట్రుక...మూలన పడి వెక్కి వెక్కి ఏడుస్తోంది. తిరుమలేశుడికి నవ్వొచ్చింది. దాని కొచ్చిన కష్టమేంటో తెల్సుకోవాలని నవ్వుతూ, "ఓహో...కేశఖండికా..." అంటూ చేతుల్లోకి తీసుకున్నాడు.

వెంట్రుక ఏడ్పుఆపి "అవును కేశఖండికనే..కానీ జనమెవ్వరూ అంత మంచి పేరుతో పిలవరు" అంది నిట్టూర్పుతో.

గోవిందుడు నవ్వి "ఇప్పుడు నీకు కలిగిన భాదేంటి?" అన్నాడు.

"నేనంటే అందరికీ చులకనైపోయింది. నా వ్యక్తిత్వానికి... నా అస్తిత్వానికి భంగం కలుగుతోంది.

అదే నన్ను బాధపెడుతోంది" అంది మళ్లీ బిగ్గరగా ఏడుస్తూ.

"నీకు కలిగిన భంగమేమిటి?" అడిగాడు ఏడు కొండలవాడు.

"నా వల్ల ఎందరో లాభపడుతూ నేనంటే విలువ లేకుండా చూస్తున్నారు. నా వల్ల మీకు కూడా ఏటా కోట్ల రూపాయలొస్తున్నాయాయె..." అంది.

శ్రీవారికి కొంచెం సిగ్గనిపించింది... ఈగో దెబ్బతిన్నట్టు చూశాడు. వెంట్రుకల ద్వారా కూడా వేంకటేశ్వర స్వామి సంపాదించుకుంటున్నాడు అని ఎక్కడ ప్రచారం జరుగుతుందోనన్న భయంతో...ఎలాంటి ఫీలింగూ కన్పించనీకుండా...

"సరే...నీ వ్యక్తిత్వానికి ఎక్కడ భంగం కలిగిందో చెప్పు కేశఖండికా..." అనడిగాడు.

"ఒక్క చోటా...రెండు చోట్లా...ఎక్కడని చెప్పను? ప్రపంచమంతా నా వల్ల కోట్లు సంపాదిస్తూనే నన్ను చిన్నచూపు చూస్తోంది. అంతెందుకూ...మీక్కూడా నా వల్ల కోట్లు..."అని ఆగింది. స్వామి కొంచెం కోపంగా చూడటంతో...

"నేను నిన్ను గౌరవంగానే చూస్తున్నా కదా...నీకు జరిగిన అవమానమెక్కడో చెప్పు" అన్నాడు.

"మీరు నా వెంట వస్తే చూపిస్తాను..నా అస్తిత్వాన్ని దెబ్బ తీస్తున్న సంఘటనలు" అంది ఏడ్పు గొంతుతో.

"సరే...పద" అన్నాడు స్వామి.

ఇద్దరూ కల్సి పొద్దున్నే ఆకాశమార్గాన బయల్దేరారు.

వెంట్రుక ఓ చోట స్వామిని ఆపి..."ఆ ఇంట్లో వంట గదిలోని దృశ్యం చూడండి స్వామీ" అంది.

భర్త భోంచేస్తూ ఉంటే...భార్య దగ్గరుండి వడ్డిస్తోంది...తిరుమలేశుడు ఆశ్చర్యపోయాడు. "టీవీ ఛానెల్స్ వచ్చాక ఇలాంటి దృశ్యాలు కరువయ్యాయి. గొప్ప దృశ్యం" అనుకున్నాడు స్వామి. ఇంతలో భర్త కంచంలో పొడవాటి వెంట్రుక దొరికింది. అది చూడగానే

భర్త అగ్రహోదగ్రుడయ్యాడు.

"ఏంటే...అన్నంలో ఈ వెంట్రుక..." అంటూ భార్యని ఈడ్చికొట్టాడు. వెంకటేశ్వర స్వామికి కూడా ఆ సౌండ్‌కి గుండె జల్లుమంది.

"చూశారా నా విలువ..." అని మళ్లీ ఏడ్పు అందుకుంది వెంట్రుక. స్వామి ఓదార్చాడు.

"అది కాదు స్వామి...మీ సృష్టి ప్రకారం తలపై లక్షా యాభై వేల వెంట్రుకలుంటాయి. ఒక్క వెంట్రుక అన్నంలో కన్పడితేనే...భార్యను కొట్టాడంటే నన్నెంత హీనంగా చూస్తున్నట్లు... ప్రపంచవ్యాప్తంగా వేల కోట్ల రూపాయల బిజినెస్సు మా వెంట్రుకలపైనే జరుగుతోంది. అయినా నా విలువ చూశారా?" అంది.

స్వామికి జాలేసింది...

"నిజమే కేశఖండికా...ఇది నీ వ్యక్తిత్వానికి భంగమే" అని నిట్టూర్చాడు. మళ్లీ బయల్దేరారు. వెంట్రుక మరో చోట స్వామిని ఆపి...'వాళ్ల మాటలు వినండి దేవా' అని చూపించింది.

ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్నారు.

"ఒరేయ్...ఈ బిజినెస్ చేసి చూద్దాం... కొండకు వెంట్రుకేసి లాగినట్టనుకో...వస్తే కొండ...పోతే వెంట్రుక" అన్నాడొకడు.

స్వామికి నవ్వొచ్చింది. పక్కనే వెంట్రుక ఉండటంతో తమాయించుకున్నాడు.

"చూసారా స్వామీ. అదీ నాకున్న విలువ. నేనంటే గౌరవం లేకుండా పోయింది. నా విలువ అంతేనా...మీక్కూడా నా వల్ల ఏటా..." అని మళ్లీ ఏడ్వబోయేంతలో 'సరె సరె...ఇంక పద' అని కదిలాడు స్వామి.

దార్లో తన గోడు వెళ్లబోసుకుంటోంది.

"మనిషి అనే వాడికి నాపై అభిమానముందో...అవహేళన ఉందో ఒక్కోసారి అర్థం కాదు. రోషం కోసం, అందం కోసం మీసాలు దిద్దుకుంటాడు. అదే గడ్డంలా పెరిగితే...బైరాగిలా ఆ గడ్డమేంట్రా అంటారు. స్థలం మారగానే నా విలువ మారుతోంది..." అని మళ్లీ కళ్లనీళ్లు తుడుచుకుంది.

"మనిషి తీరే అంత. వాటిని పట్టించుకోకు...పుట్టపర్తి బాబాకు తల వెంట్రుకల వల్లే కదా ఆ అందం...రవీంద్రనాథ్ ఠాగోర్‌ని గడ్డం లేకుండా...వీరప్పన్‌ని మీసాల్లేకుండా గుర్తు పట్టగలమా...కేశఖండికా...నీ అందం నీదే..."అని పొగిడాడు.

వెంట్రుకలో కొంచెం గర్వం కనబడింది.

"అవును స్వామీ...కేశవా అన్న పేరు మీకు వచ్చిందంటే అది నా వల్లే కదా..."అంది.

శ్రీవారు ఇబ్బందిగా "సరే...పద" అనడంతో ముక్కు చీది కదిలింది. ఆకాశ మార్గాన మరి కొంత దూరం పోయాక...

"స్వామీ...ఆ ఫ్యాక్టరీల్ని చూడండి. షాంపులు తయారు చేసే ఆ ఫ్యాక్టరీలు ఏటా ఆరు వందల కోట్లు సంపాదిస్తున్నాయి. నేనే లేకపోతే ఆ ఫ్యాక్టరీలకు అతీగతీ ఉందా..." అంది ఆవేశంగా.

"అవునవును. వాటి బతుకుదెరువంతా నీ మీదే ఆధారపడి ఉంది... నిజమే" శ్రీనివాసుడు ఆశ్చర్యపోతూనే ఒప్పుకున్నాడు.

"మరి అటు చూడండి స్వామీ..." అంది వెంట్రుక.

అక్కడ ఇద్దరు వ్యక్తులు పోట్లాడుకుంటున్నారు...చొక్కాలు పట్టుకొని అరుచుకుంటున్నారు.

"పోరా, ఫో...నువ్వు నా వెంట్రుకతో సమానం" అంటున్నాడొకడు.

మరొకడు తల వెంట్రుక పీకి..."నేను కాదురా...నువ్వే దీంతో సమానం" అంటున్నాడొకడు. స్వామి ఇబ్బందిగా వెంట్రుక వైపు చూశాడు. వెంట్రుక బాధగా 'రండి స్వామీ' అంటూ కదిలింది. మధ్య మధ్యలో...కొబ్బరి నూనె కంపెనీల్ని చూపిస్తూ...అవన్నీ తన వల్లే బతుకుతున్నాయని చెప్పింది. లక్షలాది హెయిర్ డ్రస్సర్ షాపుల్ని చూపిస్తూ నేను లేకపోతే వాళ్లంతా బజార్నపడతారు కదాని జాలి పడింది. నలభై కోట్ల ప్రస్తావన ఎక్కడ తెస్తుందోనని స్వామి కూడా నిశ్శబ్దంగా తలూపుతున్నాడు.

కొంత దూరం పోయాక...భూమ్మీదకు చూపిస్తూ..."అవి చూడండి...అవన్నీ తెల్లగా మారిన నన్ను నల్లగా మార్చే హెయిర్ డై కంపెనీలు... కోట్ల రూపాయలు సంపాదిస్తున్నాయి. నేను గనుక తెల్లగా మారకపోతే వాటి బతుకు తెల్లారిపోతుంది" అంది అక్కసుగా.

"అవును...సత్యం చెప్పావు" అన్నాడు స్వామి. ఏమనాలో తెలీక...

"అంతెందుకు స్వామీ...నేర పరిశోధనలో నేనెంత సహకరిస్తున్నానో తెలుసా...అలాగే ఆహారపదార్థాలు నిల్వ ఉంచడానికి నా నుంచి ఎల్‌సిస్టిన్ అనే ప్రోటీన్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. విగ్గులు తయారు చేసే కంపెనీలు కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్నాయి. అయినా ఈ మనిషి అనే వాడు నాకూ మతాన్ని అంటగట్టాడు..." అంది వెంట్రుక మరింత బాధగా...

దేవుడు ఆశ్చర్యపోయాడు...

"అల్పజీవివి...నీకూ మతాన్ని అంటగట్టారా?" అనడిగాడు తెలీనట్టు...

"అవును స్వామీ...ఇజ్రాయెల్‌లో పెళ్లయిన స్త్రీలు భర్తకు తప్ప ఇతరులకు వెంట్రుకలు చూపరాదన్న మతాచారంతో విగ్గులు ధరించేవారు. ఆ విగ్గులు మీకు సమర్పించిన వెంట్రుకలవి అని తెల్సుకొని హిందువుల దేవుడికి అర్పించిన వెంట్రుకలు నిషిద్ధమని లక్షల విగ్గుల్ని

తగులబెట్టారు. ఆ మంటల్లో మాడిపోతూ నేనెంత ఏడ్చానో మీకేం తెలుసు..." అంది. వెంట్రుక బాధని తగ్గించేలా స్వామి ఓదారుస్తూనే ఉన్నాడు. ఇలా...ఎన్నెన్నో సంఘటనలు చూపిస్తూ ఆ కేశం...మనోక్లేశాన్ని భగవంతుడికి చెప్పి చెప్పి...ఇద్దరూ కల్సి స్వర్గలోకం చేరుకున్నారు.

"ఊరుకో కేశఖండికా...నీ వ్యక్తిత్వం, నీ అస్తిత్వం ఎలా దెబ్బ తింటున్నాయో అర్థం చేసుకున్నాను...నీ బాధకు కొంతైనా ఉపశమనం కలిగిస్తాను" అంటూ హంస తూలికా తల్పంపై పవళిస్తూ...వెంట్రుకని తన గుండెలపై పడుకోబెట్టుకున్నాడు.

వెంట్రుక తన జన్మ ధన్యమైనంతగా ఆనందపడి పోయింది.

పది నిముషాల తర్వాత... పద్మావతీదేవి వస్తూనే...

"ఇంతసేపూ ఎక్కడికెల్లారు ప్రభూ...నాతో మాట మాత్రమైనా చెప్పలేదే...?" అంటూ గారాబంగా శ్రీనివాసుడి ఎదపై తల ఆనించింది. అంతే.. స్వామి ఛాతి మీద నల్లగా నిగనిగలాడుతున్న వెంట్రుక కన్పించి చివ్వున లేచింది.

కోపంగా...ఎడం చేత్తో ఆ వెంట్రుకని తీసింది.

"నిజం చెప్పండి...ఇప్పటివరకూ ఎక్కడికెళ్లారు... ఈ వెంట్రుక ఎవర్తిది...?" అంది కళ్లు ఎర్రబారుతుంటే...

స్వామి అదిరిపడ్డాడు...

"అది కాదు దేవీ...ఆ వెంట్రుక..." అని చెప్పబోయేంతలోనే...కసిగా దాన్ని "తల మాసిందానా..."అని తిట్టింది.

గుప్పిలిమి చూస్తూ...'ఉఫ్...' అని గట్టిగా ఊదింది.

ఆ దెబ్బతో వెంట్రుక గిరికీలు కొట్టుకుంటూ వచ్చి కళ్యాణకట్టలో పడింది...

"పద్మావతీ...నన్ను నమ్ము...పాపం ఆ వెంట్రుక విషయంలో నువ్వు అనుమానపడాల్సింది ఏమీ లేదు" అన్నాడు ప్రాధేయపడుతున్నట్లుగా...

పద్మావతి నమ్మలేదు...రెండు గంటల పాటు దాని కథంతా చెప్పాక...నమ్మింది.

అవునా...పాపం... అంటూ నవ్వింది.

"హమ్మయ్య...వెంట్రుకవాసిలో గండం తప్పింది" రిలీఫ్‌గా అనుకున్నాడు శ్రీనివాసుడు.

నీతి : కొన్ని జీవితాలంతే... వాటిని దేవుడు కూడా మార్చలేడు.

కె.వి.నరేందర్